


**అ**వును నేను అంతా చూస్తూనే ఉన్నాను... ఆయన వస్తూనే 'దాని గదిలోకి దూరారు. ఆ నడకలో ఎంత తొందర.. ఆ తొందరలో ఎంత విరహం.. ఆ విరహం భరించవలసి వచ్చినందుకు ఎంత చిరాకు...? అవును మరి... ప్రియురాలి విరహం.. దుస్సహమే గదా... వెళ్తుతూ, వెళ్తూతూనే ఆయన ఆ వగలాడి బుగ్గలు ఆప్యాయంగా స్పృశించారు. ఆయన చేతి స్పర్శకు పులకించి పోయినట్లుగా ఆ జాణరాగాలు పలికిస్తోంది. దాని ఆ తణకు బెళుకులూ, ఆ వగలూ- వయ్యారం ఆయన్ను ఎంతగా ఆకట్టుకున్నాయంటే ఆయన రెప్ప వాల్చకుండా సర్వమూ మరచి దాని కళ్ళల్లోకే చూస్తూండిపోయారు.

ఆయన సర్వేంద్రియాలతో పాటుగా మెదడూ, హృదయం కూడా తానే స్వంతం చేసుకోవాలన్న దురాశతో ఆ వగలాడి తన హయలూ, వగలతో పాటుగా తన గాన ప్రావీణ్యాన్ని కూడా ప్రదర్శిస్తోంది. అది కోరుకున్న విధంగానే ఆయన తన హృదయంతో పాటుగా చూస్తూండిపోయారు.

నాకు తెలును-

ఆ వగలాడి గానం అంత అద్భుతంగా లేదు. ప్రావీణ్యం గానీ, మాధుర్యంగానీ మచ్చుకైనా లేవు. అటువంటి చెత్త ఆయన్ను వశం చేసుకోడం ఎంత విచిత్రం. దాని తళుకు బెళుకులకు ఆయన ఎంత లొంగిపోయారో తలచుకుంటే నా గుండె కన్నీరు కారుస్తుంది. నిజానికి ప్రస్తుతం నాకు కోపంతో ఒళ్ళు మండిపోతోంది. ప్రొద్దుటనగా బయటకు వెళ్ళారే.. బయట ఎంత అలసి పోయారో... అంతగా అలసిపోయిన మనిషికి స్నానం, పానం అక్కర్లేదూ.. తిండీ తిప్పలూ లేకుండా ఏదో ఆరి పోతున్నట్లుగా వస్తూనే ఆ గదిలో దూరక పోతేనేం...? అయినా ఆయనకు లేకపోయినా కనీసం దానికైనా వుండాలీ...

బయటి నుంచి వచ్చిన మనిషికి కాస్త విశ్రాంతి అవసరం అనే ఇంగితం లేకుండా ఆ వికలికలూ.. వకవకలూ... ఛీ... ఛీ అయినా మనబంగారం మంచిది కానప్పుడు ఎవర్ని అనుకుంటే ఏం లాభం...?

ఇప్పుడంటే ఆ కులుకులాడి మోజులో పడిపోయి నన్నిలా నిర్లక్ష్యం చేస్తున్నారే కానీ. ఒకప్పుడు.... నేను కొత్తగా ఆయన జీవితంలోకి ప్రవేశించిన రోజులు నాకింకా జ్ఞాపకమే.. అవును. ఆరోజులు ఎంత మధురమైనవి...? ఆయనకు రోజులో ఇరవై నాలుగు గంటలూ నాతోడిదే లోకం.

మా అనుబంధానికి వగలూ- రాత్రీ అనే భేదం ఉండేదికాదు. తల్లిదండ్రుల కోపాన్ని కానీ, తోడి వారి హేళనను గానీ లెక్కచేసేవారా...? ఉహుఁ... నా తరువాతే ఆయనకు ఎవ్వరైనా. రాత్రి నిద్రలో కూడా నేను ఆయన గుండెల మీద ఉండాల్సిందే... మంద్ర స్వరంతో నేను గానం చేస్తోండగా వింటూ రాత్రి ఏ ఝాములోకో నిద్రలోకి జారిపోయే వారు.

మగత నిద్రలో చంటి పిల్లాడిలా తన గుండెల మీది నుంచి తొలగిన నన్ను వెదుక్కుని మరీ బాహువుల మధ్య బంధించి, నా పెదవులనూ, చెక్కిళ్ళనూ స్పృశిస్తూ, స్పృశిస్తూ, అలాగే తిరిగి నిద్రలోకి ఒరిగి పోయే ఆయన నా కంటికి చంటి పిల్లాడిలా కనిపించారే తప్ప, ఇంత దక్షిణ నాయకుడు అవుతాడని నేనెప్పుడూ అనుకోలేదు.

ఒక్కోసారి అల్లరికి దూరంగా తొలగి ఓ మధురమైన పల్లవి గానం చేసేదాన్ని. అంతే ఆయన నా వశీకరణ శక్తికి లొంగిపోయిన వారిలా ఆబగా నన్ను చేతుల్లోకి తీసుకునేవారు.

నేను దూరంగా ఉండిపాడటం, మాట్లాడ్డం ఆయన భరించలేరు. సర్వవేళలా, సర్వావస్థలా నేను ఆయనకు చేరువలో, చేతుల్లో ఉండాల్సిందే.

పాడుతూ, అల్లరి కబుర్లు చెప్తూ, కొంటెగా నవ్వేస్తూ, ప్రపంచాన్ని చూపించే దాన్ని. అదో - అలౌకికానందం. తిరిగి నిద్రలేస్తూనే కన్నైనా విప్పకుండా చేతులు చాస్తూ నన్ను వెదుక్కునే ఆయన్ను చూసి సంతోషంతో, గర్వంతో నా హృదయం ఉప్పొంగిపోయేది. ఆనందంగా ఆయన చేతుల్లో ఒదిగిపోయేదాన్ని. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన్ను నా పాటతో నిద్రపుచ్చి నా కబుర్లతో మేల్కొలిపే దానను.

ఒక్కసారి కొంటె తనానికి అలకవహించి మౌనంగా ఉండి పోయేదానను. ఇహ అప్పుడాయన అవస్థ చూస్తోంటే ఎంత నవ్వు వచ్చేదో.

నా అలక పోగొట్టి మౌనవ్రతం వదిలించేందుకు ఆయన నన్ను తన చేతుల్లోకి తీసుకుని అంగాంగాలనూ స్పర్శిస్తూ స్పృశిస్తూ గిలిగింతలు పెట్టేవారు.

ఎంతకూ వదలని నా మౌనం చూసి విసుక్కునేవారు. కోపం తెచ్చుకుని దూరంగా నెట్టేసేవారు. మళ్ళీ అంతలోనే నా విరహం భరించలేనట్లుగా తిరిగి నన్ను తన చేతుల్లోకి తీసుకునే వారు. లాలించేవారు. అంతే తెచ్చిపెట్టుకున్న నా అలక మంత్రించినట్లుగా మాయమయ్యేది. ఇహ ఎన్నెన్ని కబుర్లో. మా కబుర్లతో ప్రపంచం అంతా చుట్టి వచ్చే వాళ్ళం. ఆ కబుర్లకు అంతూ పొంతూ ఉండేది కాదు.

అలకతీరిన తరువాత ప్రణయం మరింత మధురం కదా. అయితే ఇవన్నీ గతించిన రోజుల మధురమైన జ్ఞాపకాలు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి.

నాకు తెలును.

మార్పు వచ్చింది నాలో కాదు. నా గానంలో, నా కబుర్లలో ఆయన పట్ల నాకు గల ప్రేమలో మార్పులేదు. రాదు. ఆయన్ను అలరించేందుకు ఇంకా ఎక్కువగా నన్ను నేను సంస్కరించుకొంటున్నాను. కానీ, మార్పల్లా ఆయనలోనే.

నా మౌనాన్ని నా ఎడబాటును క్షణం కూడా సహించలేని ఆయన ఇప్పుడు నా వంక కన్నెత్తి అయినా చూడటం లేదు. కనీసం నన్ను తాకడం లేదు.

ఆయన లోకమంతా ఆ వన్నెలాడే అయిపోయింది.

నాకు తెలును. తళుకు బెళుకులతో తప్ప అది ఏ విధంగానూ నన్ను మించలేదు. నిజానికి నన్ను మించిన అర్హతలు దానికి ఏమున్నాయి కనుక?

అయినా ఆయనా ఆ తళుకు బెళుకులకే లొంగిపోతున్నప్పుడు ఇహ నేను చేయగలిగింది ఏముంది? విచారించడం తప్ప. నా విచార మల్లా ఒక్కటే... ఆయన తన ఆరోగ్యం గురించి గూడా పట్టించుకోకుండా వగలూ, రాత్రీ తేడా లేకుండా ఇలా దాన్ని చూస్తూ గడుపుతుంటారు గదా. ఇలా అయితే ఆయన ఆరోగ్యం ఏం కాను? పోనీ హెచ్చరిద్దామంటే నాకు అసూయ అనుకోరూ. అయినా ఆయన నా మాట వింటారా... ఏమన్నానా... నిజంగా నాది అసూయేనంటారా..., కావచ్చు. అన్నట్టు నేనెవరో నా పేరేమిటో మీకు చెప్పనేలేదు కదూ....

నా పేరు 'రేడియో' దాని పేరు. అదే ఆ వన్నె లాడి పేరు 'టెలివిజన్' ఆయన ముద్దుగా "టి.వి." అని పిలుచుకుంటారు.

ఎంతైనా కొత్త మోజు కదా. ★